క్లుప్తంగా

అక్కాతమ్ముళ్లకు ఉద్యోగాలు..


మణికంఠ


ధనలక్ష్మి

మెరకముడిదాం: ఒకేసారి అక్కాతమ్ముడు ఉద్యోగాలకు ఎంపికవ్వడంతో మండలంలోని నరసయ్యపేటలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన తాడ్డి రామకృష్ణ, తవుడమ్మలకు కుమార్తె ధనలక్ష్మి, కుమారుడు మణికంఠ ఉన్నారు. ధనలక్ష్మి డిగ్రీ పూర్తి చేయగా.. మణికంఠ డిగ్రీ చదువుతున్నాడు. వీరిద్దరూ ఓ పక్క చదువుతూనే పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నారు. ఈక్రమంలో ధనలక్ష్మి సీఐఎస్ఎఫ్‌లో.. మణికంఠ బీఎస్ఎఫ్‌లో ఒకేసారి ఉద్యోగాలు సాధించారు. తల్లిదండ్రులు కష్టపడి చదివించగా.. ఇద్దరూ ప్రయోజకులు కావడంతో గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు.

అంతర పంటలతో అదనపు ఆదాయం

లక్కవరపుకోట: ప్రధాన పంటలో అంతర పంటలు సాగుచేయడం వల్ల అదనపు ఆదాయం పొందవచ్చని జిల్లా ప్రకృతి వ్యవసా య ప్రాజెక్టు మేనేజర్ ఎం.ఆనందరావు అన్నారు. మండలంలోని లింగంపేటలో ఏటీఎం మోడల్ విధానంలో రైతులు సాగు చేస్తు న్న పంటలను ,అపరాల పంటల్లో అంతర పంటలుగా కూరగాయల సాగును ఆదివారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ అంతర పంటల సాగు వల్ల ప్రధాన పంటను చీడపీడలు ఆశించవన్నారు. అనంతరం కషాయాలు, ద్రావణాల తయారీపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వరప్రసాద్, కోటిబాబు, ఈశ్వరరావు, బి.జానకి, బి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అలుపెరగని పోరాటం


మండల నూతన కమిటీతో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు

గజపతినగరం: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ(స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా)అలుపెరగని పోరాటం చేస్తోందని ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి.శిరీష అన్నారు. ఎస్ఎఫ్ఐ మండల మహాసభల ముగింపు సందర్భంగా స్థానిక గాయత్రీ కళా శాల ఆవరణలో ఆసంఘం జెండాను ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం 12 మందితో ఎస్ఎఫ్ఐ మండలశాఖ నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా పి.గౌరి, కార్యదర్శిగా సోమేష్ , ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జె.రవి, జిల్లా సహాయ కార్యదర్శి కె.జగదీష్,తదితరులు పాల్గొన్నారు.

నేటి కార్యక్రమాలు

అమ్మవారి దేవస్థానంలో వేలం
చీపురుపల్లి: పట్టణంలోని కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో కొబ్బరి చెక్కలు, చీరలు, జాకెట్టు ముక్కల కోసం సోమవారం బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈఓ బి.శ్రీనివాస్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు అమ్మవారి దేవస్థానంలో వేలం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. 2025 మార్చి 1 నుంచి 2026 ఫిబ్రవరి 28 వరకు భక్తుల ద్వారా వచ్చిన కొబ్బరి చెక్కలు, చీరలు, జాకెట్ ముక్కలు దక్కించుకునేందుకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. కొబ్బరి చెక్కల కోసం రూ.25 వేలు, చీరలు, జాకెట్టు ముక్కల కోసం రూ.15 వేలు ధరావత్తు చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని, పాట దక్కించుకున్న అనంతరం మిగిలిన సొమ్ము చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపైశిక్షణ
చీపురుపల్లి/ వేపాడ: సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై చీపురుపల్లి, వేపాడ మండలాల్లోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, మండలస్థాయి అధికారులకు సోమవారం, మంగళవారం శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీఓలు యు.సరళ, సూర్యనారాయణ ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయం త్రం 6గంటల వరకు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఏపీఎస్ఐఆర్‌డీపీఆర్ డైరెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న శిక్షణకు సర్పంచ్ లు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది హాజరవ్వాలని కోరారు.

రెవెన్యూ సదస్సులు
వేపాడ/దత్తిరాజేరు: వేపాడ మండలంలోని వావిలపాడు,చామలాదేవీఅగ్రహారం, దత్తిరాజేరు మండలంలోని మరడాం,మద్రివలస గ్రామంలో సోమవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్‌లు జె.రాములమ్మ, వరప్రసాద్ ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. రైతులు తమ భూసమస్యలపై అర్జీలు అందజేయవచ్చని పేర్కొన్నారు.

ధనుర్మాస పూజలు ప్రారంభం
దత్తిరాజేరు: దత్తి గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ధనుర్మాస పూజలు ప్రారంభించనున్నట్లు ఆలయ ధర్మకర్త పెంకి తిరుపతినాయుడు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆలయ పూజారి కందాడ హరికృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో నెల రోజుల పాటు ప్రత్యేక పూజలు,కార్యక్రమాలు నిర్వహించనున్నామని, పూజా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు.

100 శాతం ఉత్తీర్ణతకు రోజుల ప్రణాళిక

- పదోతరగతి విద్యార్థుల కోసం 100 రోజుల ప్రణాళిక
- ఈనెల 1న ప్రారంభమైన ప్రత్యేక తరగతులు
- రోజువారీ పరీక్షలు, సెలవురోజుల్లోనూ తరగతులు,
- జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదోతరగతి విద్యార్థుల సంఖ్య:16,635


ఎస్.కోట ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు ప్రత్యేక క్లాసులు చెబుతున్న హెచ్ఎం జగదీశ్వరరావు

శృంగవరపుకోట: పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా పాఠశాల విద్యాశాఖ 100 రోజుల కార్యాచరణతో సిద్ధమయ్యింది. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 1వ తేదీ నుంచి ప్రత్యేక కార్యాచరణను అమల్లోకి తెచ్చింది. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఫలితాలు, మార్కులు, సాధించాలన్న ధృడ సంకల్పంతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను పబ్లిక్ పరీక్షలకు సమాయత్తం చేస్తున్నారు.ఉత్తమ ఫలితాల సాధన కోసం వ్యూహాలతో ప్రభుత్వ ఉపాధ్యాయులు సిద్ధమయ్యారు. రోజూ ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకూ, సాయంత్రం 4గంటల నుంచి 5గంటల వరకూ స్టడీ అవర్స్, ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. సెలవు దినాల్లో సైతం తరగతులు పెడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 300 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నుంచి ఈ ఏడాది 16,635 మంది విద్యార్థులు టెన్త్ పబ్లిక్ పరీక్షలకు హాజరు కానున్నారు. వారిలో పరీక్షల పట్ల భయాన్ని తొలగించడం, ఆత్మస్థైర్యం నింపడం కోసం వంద రోజుల ప్రణాళికలో భాగంగా ఉపాధ్యాయులకు పాఠశాల విద్యాశాఖ లక్ష్యాలను నిర్దేశించింది.

లక్ష్యాలు:

1. వ్యక్తిగత సన్నద్ధతలో భాగంగా ఉపాధ్యాయులు ప్రతీ విద్యార్థిని క్షుణ్ణంగా పరిశీలించాలి. వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారించి క్రమంగా వారిని సన్నద్ధులను చేయాలి
2. ప్రత్యేక తరగతుల ద్వారా అదనపు బలాన్ని విద్యార్థులకు అందివ్వడం.
3. నిత్యం పబ్లిక్‌తరహాలో బ్లూప్రింట్ ఆధారంగా పరీక్షలు పెట్టి విద్యార్థుల్లో భయాన్ని తొలగించడం
4. విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేస్తూ, వారి సందేహాలు తీర్చి, శాస్త్రీయ అవగాహన కల్పించడం
5. డీఈఓ, మండల స్థాయి అధికారుల పర్యవేక్షణ, సబ్జెక్ట్ టీచర్లు అన్ని రకాల రికార్డులు నిర్వహించడం

నిబంధనలు:
వంద రోజుల ప్రణాళిక అమలు జరిగేలా చూడాల్సిన బాధ్యత హెచ్ఎంలదే. సబ్జెక్ట్ టీచర్లతో మాట్లాడి ప్రణాళికను పక్కాగా అమలు చేయాలి. సబ్జెక్ట్ టీచర్లపై సమాన పనిభారం ఉండేలా చూడడం, స్లిప్ టెస్ట్‌ల నిర్వహణ, మూల్యాంకనం సకాలంలో చేసి విద్యార్థులకు ప్రగతి వివరిస్తుండాలి. రెమిడియల్ క్లాసులు నిర్వహించి అసైన్‌మెంట్లు పెట్టి వెనుకబడిన వారిని, అటు ప్రతిభావంతులను వాళ్ల స్థాయికి తగ్గట్టుగా తయారు చేయాలి. పాఠశాల పనివేళల కంటే ఉపాధ్యాయులు రోజూ రెండు గంటలు అదనంగా సమయాన్ని కేటాయిస్తూ, సెషన్స్ నడిచేలా టైమ్‌టేబుల్ వేయాలి. ప్రతీ ఆదివారం, సెలవుదినాల్లో తరగతులు నిర్వహించాలి. బాలికల రక్షణకు ప్రత్యేక శ్రద్ధ చూపాలి. 100 రోజుల ప్రణాళికను ఖచ్చితంగా తల్లిదండ్రులకు వివరించాలి. సహేతుకమైన కారణం లేకుండా టీచర్లకు సెలవులు, ప్రత్యేక తరగతుల నుంచి మినహాయింపునకు పర్మిషన్లు ఇవ్వకూడదు. ఎస్‌సీఈఆర్‌టీ ఇచ్చిన స్టడీ మెటీరియల్ వినియోగించాలి. సెలవుల్లో పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులకు సీసీఎల్ ఇవ్వాలి.

శత శాతం ఉత్తీర్ణతే లక్ష్యం



పరీక్షలకు సమయం దగ్గర పడుతోంది. ఉన్న సమయాన్ని విద్యార్థులు ఉపయోగించుకుని మంచి ఫలితాలు సాధించేలా వారిని తయారు చేస్తున్నాం.రోజూ అదనంగా రెండు గంటలు తరగతులు నిర్వహిస్తున్నాం. రెండు పీరియడ్‌లు కలిపి ఒక సెషన్‌గా స్కూల్ టైమ్‌ని 4 సెషన్స్‌గా మార్చాం. విద్యార్థులకు సబ్జెక్టుల వారీగా సందేహాలు నివృత్తి చేస్తూ, వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నాం. పబ్లిక్ పరీక్షలపై అవగాహన కల్పించి,ఎలాంటి ప్రశ్నలు, ఏతరహాలో వస్తాయి, ఎన్ని మార్కుల కి ఎలా రాయాలి, ఇలా ప్రతి అంశాన్ని చెబు తూ, నిర్వహించే ఒక పునశ్చరణ ప్రక్రియే 100 రోజుల ప్రణాళిక. శతశాతం ఉత్తీర్ణత, మరిన్ని ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించడమే లక్ష్యం.

– ఉల్లూరి మాణిక్యంనాయుడు, డీఈఓ.

చాలా ఉపయోగం ఉంది



100 రోజుల ప్రొగ్రాం చాలా బాగుంది. రోజూ ఉదయం, సాయంత్రం రెండు గంటలు ప్రత్యేకంగా క్లాసులు చెబుతున్నారు. సెలవురోజుల్లో క్లాసులు పెడుతున్నారు. రోజూ స్లిప్ టెస్ట్‌లు పెట్టి, వెంటనే పేపర్లు దిద్ది, తప్పులు చెప్పి సందేహాలు తీరుస్తున్నారు.

– ఎల్.శశికుమార్, టెన్త్ విద్యార్థి, ఎస్.కోట హైస్కూల్


ఆదివారం నాడు విద్యార్థులకు గణితం బోధిస్తున్న టీచర్ వి.ఏ.ఎన్.రాజు

అమలు చేస్తున్నాం



విద్యాశాఖ ఇచ్చిన 100 రోజుల కార్యాచరణను కచ్చితంగా అమలు చేస్తున్నాం. ప్రత్యేక తరగతులకు కొంతమంది విద్యార్థులు హాజరు కావడం లేదు. ప్రత్యేక తరగతులకు రాని విద్యార్థుల తల్లిదండ్రులను సంప్రదిస్తున్నాం. సెలవు రోజుల్లో కూడా వచ్చి సేవలందిస్తున్న ఉపాధ్యాయుల కష్టాన్ని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు గుర్తించి గౌరవించాలి. మంచి ఫలితాల కోసమే మా ఆరాటం.

– బాసూరి నర్సింగరావు, ఎంఈఓ–1, శృంగవరపుకోట

నిబద్ధతతో పని చేస్తున్నాం



శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ఉపాధ్యాయులమంతా అంకితభావం, నిబద్ధతతో పని చేస్తున్నాం.సెలవుల్లోనూ స్కూల్‌కి వస్తున్నాం. ఎస్‌సీఈఆర్‌టీ ఇచ్చిన ప్రణాళికను కచ్చితంగా అమలు చేస్తున్నాం. మంచి ఫలితాలు సాధిస్తామన్న నమ్మకం ఉంది. అన్ని స్థాయిల విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నాం.

– వి.ఏ.ఎన్.రాజు, గణిత ఉపాధ్యాయుడు, ఎస్.కోట ఉన్నత పాఠశాల

భయం పోయింది



పబ్లిక్ పరీక్షల తరహాలోనే రోజూ పరీక్షలుపెడుతున్నారు.ఈ పరీక్షల్లో తక్కువ మార్కులు వస్తే అందుకు గల కారణాలను వివరించి, సందేహాలు తీరుస్తున్నారు. సిలబస్ అంతా అయిపోయింది. సిలబస్ రివిజన్ చేస్తున్నారు.ఇప్పుడు పబ్లిక్ పరీక్షలపై భయం పోయింది.

– ఏ.నిహారిక, టెన్త్ విద్యార్థిని, ఎస్.కోట హైస్కూల్

'సుపథ' ప్రతిభా పరీక్షలు



ఎస్.కోట ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఆదివారం 'సుపథ' సంస్థ ఆధ్వర్యంలో ప్రతిభా పరీక్షలు నిర్వహించారు. 13 పాఠశాలలకు చెందిన 423 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. వీరిని సబ్‌జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాలుగా విభజించి శ్లోక పఠనం, పద్య పఠనం, వేదం, గేయాలు, వ్యాసరచన, క్విజ్ అంశాల్లో పోటీలు నిర్వహించి, తొలి మూడు స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి మాట్లాడుతూ తల్లి లాంటి తెలుగుభాషను ఇంగ్లిష్ మోజుతో నిర్లక్ష్యం చేయకూడదన్నారు. తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు కృషి చేస్తున్న సుపథ నిర్వాహకులను అభినందించారు. సుపథ వ్యవస్థాపకులు యు.వి.ఏ.ఎన్.రాజు సుపథ నిర్వహణ, ఆవశ్యకతను విద్యార్థులు వారి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు వివరించారు. – శృంగవరపుకోట

నేత్ర వైద్య శిబిరం



పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఎస్.కోట ఆర్యవైశ్య సంఘం నేతృత్వంలో, శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో వెంకటరమణపేట గ్రామంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి చెందిన ఆప్తాలమిక్ దేవి 92మందికి నేత్రపరీక్షలు చేసి 38 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. క్యాంప్ కో–ఆర్డినేటర్ ఎస్. జోగారావు మాట్లాడుతూ ఎంపిక చేసిన 34 మంది వృద్ధులకు విశాఖపట్నంలోని తమ శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రిలో ఆపరేషన్‌లు చేయించేందుకు బస్సులో తరలించామని చెప్పారు. కంటి పరీక్షలు చేయించుకునేందుకు శిబిరానికి వచ్చిన వారికి ఆర్యవైశ్య సంఘ సభ్యులు భోజనాలు అందజేశారు. – శృంగవరపుకోట

ఆత్మీయ సమ్మేళనం



గజపతినగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1994- 1999 బ్యాచ్ పూర్వ విద్యార్థుల రజతోత్సవ ఆత్మీ య సమ్మేళనం ఆదివారం ఆ పాఠశాలలో నిర్వహించారు. వివి ధ ప్రాంతాల్లో, వివిధ రంగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులంతా 25 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని వారి కుటుంబ జీవితం, జీవనస్థితిగతులను పంచుకున్నారు. అప్పటిలో పాఠాలు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు. – గజపతినగరం

అమరజీవికి ఘన నివాళి

శృంగవరపుకోట: ఆంధ్ర రాష్ట్రం ఆవిర్భావం కోసం ప్రాణాలు త్యాగం చేసిన ఆదర్శమూర్తి పొట్టి శ్రీరాములు తెలుగు ప్రజల గుండెల్లో స్థిరస్థాయిగా నిలిచిపోతారని ఆర్యవైశ్యులు, పాత్రికేయులు అన్నారు. పొట్టి శ్రీరాములు వర్ధంతి నేపథ్యంలో స్థానిక గాంధీపార్కు వద్ద ఉన్న ఆయన విగ్రహానికి వాసవీ క్లబ్ సభ్యులు, పుణ్యగిరి వర్కింగ్ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఆదివా రం వేర్వేరుగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. పుణ్యగిరి వర్కింగ్ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గోవింద్ ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు పొట్టి శ్రీరాములు
చీపురుపల్లిరూరల్(గరివిడి): ఆంధ్రరాష్ట్ర ఏర్పాటు కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు నేటి, భవిష్యత్ తరాలకు ఆదర్శ ప్రాయుడని గరివిడి ఎంఈఓ డి.అప్పన్న అన్నారు. పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని కొండపాలెం ఉన్నత పాఠశాలలో ఆయన చిత్రపటానికి ఉపాధ్యాయులతో కలిసి పూలమాలలు వేసి నివాళుల్పించారు. అలాగే గరివిడి ఆర్ఓబీ కింద ఉన్న పొట్టి శ్రీరాముల విగ్రహానికి ఆర్యవైశ్య సంఘ నాయకులు పూలమాలలు వేసి నివాళు ర్పించారు. ఆర్యవైశ్య సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు వి.వి.ఎస్.ఎస్.ఎన్.గుప్త, ఎంపీటీసీ యడ్ల సూర్యారావు, తదితరులు పాల్గొన్నారు.

బొండపల్లిలో..
బొండపల్లి: పొట్టి శ్రీరాములు వర్ధంతిని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఎంపీపీ చల్లా చలం నాయుడు, తహసీల్దార్ డోలా రాజేశ్వరరావు, ఎంపీడీఓ జి.గిరిబాల, వివిధ శాఖల అధికారులు, పలువురు సర్పంచులు,ఎంపీటీసీ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.


బొండపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ చలం నాయుడు,అధికారులు, ప్రజాప్రతినిధులు


చీపురుపల్లిరూరల్(గరివిడి): కొండపాలెం ఉన్నత పాఠశాలలో పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంఈఓ అప్పన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు


లక్కవరపుకోట: జమ్మాదేవిపేట గురుకులంలో పొట్టిశ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బోధన సిబ్బంది, విద్యార్థినులు

గురుకులంలో..
లక్కవరపుకోట: జమ్మాదేవిపేట సమీపంలోని బాలికల గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ యు.విజయ్‌కుమార్‌పాత్రో ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి సిబ్బంది, విద్యార్థినులలతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


శృంగవరపుకోట: ఎస్.కోటలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేస్తున్న ఆర్యవైశ్యులు


శృంగవరపుకోట: ఎస్.కోటలో పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పాత్రికేయులు


చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడిలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేస్తున్న ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు

ప్రైవేట్ ఎలక్ట్రీషియన్లే దిక్కు..

- సచివాలయాల పరిధిలో జేఎల్ఎంల కొరత
- రెండు, మూడు సచివాలయాలకు ఒక జేఎల్ఎం
- 22 సచివాలయాలకు గాను 9 సచివాలయాల్లో పోస్టులు ఖాళీ

గంట్యాడ: మండల పరిధిలోని పలు గ్రామాల్లో విద్యుత్ సమస్యలేర్పడితే ప్రైవేట్ ఎలక్ట్రీషియన్లే దిక్కవుతున్నారు. గ్రామాల్లో విద్యుత్ సేవలు అందించేందుకు నియమించిన జూనియర్ లైన్‌మెన్ (జేఎల్ఎం) గ్రేడ్ –2 పోస్టులు పూర్తి స్థాయిలో భర్తీ చేయకపోవడంతో విద్యుత్ వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. జేఎల్ఎంల కొరత వల్ల రెండు, మూడు సచివాలయాలకు ఒకరిని నియమించారు. దీంతో వారు ఏ గ్రామానికీ పూర్తి స్థాయిలో సేవలు అందించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏ ఇంట్లో విద్యుత్ సమస్య వచ్చినా జేఎల్ఎంలు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో ప్రైవేట ఎలక్ట్రీషియన్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి.

9 సచివాలయాల పరిధిలో..
మండలంలో 22 సచివాలయాలు ఉన్నాయి. ఇందులో 9 సచివాలయాలకు జేఎల్ఎంలు లేరు. నీలావతి, కితుబర్తి, కొండతామరపల్లి, రామవరం, రామభద్రపురం, రేగుబిల్లి, తాటిపూడి, సిరిపురం, జగ్గాపురం సచివాలయాల పరిధిలో జేఎల్ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో పక్క సచివాలయాల జేఎల్ఎంలకు అదనపు బాధ్యతలు అప్పగించారు.



రామవరం సచివాలయం

ఉన్నతాధికారులకు తెలియజేశాం..

మండలంలో 22 సచివాలయాలుండగా తొమ్మిది సచివాలయాల పరిధిలో జేఎల్ఎంల పోస్టులు ఖాళీగా ఉన్నమాట వాస్తవమే. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

– శ్రీనివాసరావు, ఏఈ, గంట్యాడ విద్యుత్ సబ్‌స్టేషన్

వీఆర్‌ఓలు తీరు మార్చుకోవాలి

- మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల మండిపాటు

బొండపల్లి: మండలంలోని వీఆర్‌ఓల పని తీరు బాగోలేదని, తీరు మార్చుకోకుంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని ఎంపీపీ చల్లా చలంనాయుడు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. శాఖల వారీగా అధికారులు ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. సర్పంచ్‌లు,ఎంపీటీసీలు గ్రామాల్లో సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చా రు. మ్యుటేషన్లకు సంబంధించి అన్ని పత్రాలు సక్రమంగా ఉన్నా వీఆర్ఓలు ఆన్‌లైన్ ఫైల్‌ను రిజెక్ట్ చేస్తున్నారని, రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారని సభ్యులు తహసీల్దార్ రాజేశ్వరరావు వద్ద ఏకరువు పెట్టారు.తహసీల్దార్ స్పందిస్తూ ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా చూస్తామని, మ్యుటేషన్లకు సమగ్ర పత్రాల ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నప్పటికీ రిజెక్ట్ చేస్తే సంబంధిత వీఆర్‌ఓలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వరి పంటను రెల్ల రాల్చు పురుగు ఆశించడంతో పాటు, ఇటీవల కురిసిన వర్షాలకు పంటకు తీవ్రంగా నష్టం వాటిల్లిందని, రైతులను ఆదుకోవాలని అంబటివలస ఎంపీటీసీ తాళ్లపూడి అప్పలనాయుడు వ్యవసాయ అధికారులను కోరారు. వ్యవసాయ అధికారులు స్పందిస్తూ పంట నష్టం వివరాలను జిల్లా మంత్రి దృష్టికి తీసుకువెళ్లామని వివరించారు ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించి మండల, గ్రామస్థాయి ప్రజాప్రతినిధులకు అధికారులు ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదని, ఇకపై కూడా ఇలాగే జరిగితే సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళతామని ఎంపీపీ అన్నారు. మండలంలో నాలుగు సచివాలయాలకు జేఎల్ఎంలు లేరని, విద్యుత్ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, ఆయా సచివాలయాలకు జేఎల్ఎంలను నియమించాలని ఎలక్ట్రికల్ ఏఈ శంకరరావును ఆయా సచివాలయాల పరిధి ప్రజాప్రతినిధులు కోరారు. జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావు, ఎంపీడీఓ జి.గిరిబాల, ఏఓ కె.తులసీరాం, సీనియర్ సహాయకులు ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీపీ చలం నాయుడు